
సాక్షి
అనంతపురం
మంగళవారం । 5 । డిసెంబర్ । 2023



'దృశ్యం' తరహాలో హత్య

దృశ్యం సినిమా తరహాలో ఓ యువకుడిని అనంతపురంలో హత్య చేసి.. ఆనవాళ్లు లేకుండా మృతదేహాన్ని కాల్చేశారు. 10లో



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో సోమవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.6.50, సరాసరి రూ.14 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
29.4°/20.2°

జిల్లా అంతటా సోమవారం తుపాను వాతావరణం నెలకొంది. పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. ఉదయం చలి కొనసాగింది.

న్యూస్‌రీల్

ప్రత్యేక డ్రైవ్‌లో 7,939 క్లెయిమ్‌లు



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్: ప్రత్యేక ఓటరు సవరణలో భాగంగా ఈ నెల 2, 3 తేదీల్లో జిల్లావ్యాప్తంగా 2,213 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 7,939 క్లెయిమ్‌లు అందాయి. కొత్తగా ఓటరు నమోదుకు 5,418 (ఫారం-6) దరఖాస్తులు, ఓటు తొలగింపునకు సంబంధించి 838 (ఫారం-7) దరఖాస్తులు, ఓటు వివరాల్లో చేర్పులు, మార్పునకు సంబంధించి 1,683 (ఫారం-8) దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఇప్పటి వరకు 5,744 దరఖాస్తులను డిజిటలైజ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

నేటి నుంచి 'రబీ' ఈ-క్రాప్



ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ (ఫైల్)

అనంతపురం అగ్రికల్చర్: రబీకి సంబంధించి మంగళవారం నుంచి జిల్లా వ్యాప్తంగా ఈ-క్రాప్ (పంట నమోదు) ప్రక్రియ మొదలవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏఓ) ఉమామహేశ్వరమ్మ సోమవారం తెలిపారు. డివిజన్, మండల, ఆర్‌బీకే స్థాయి అధికారులు, సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇవ్వడంతో పాటు అప్లికేషన్‌ను అందుబాటులోకి తెచ్చామన్నారు. సర్వే నంబరు ఆధారంగా జియో కో ఆర్డినేటర్స్‌తో ఫొటో తీసి అప్లికేషన్‌లో నమోదు చేయాలన్నారు. సాగు చేసిన పంట కాకుండా వేరే పంటలు నమోదు చేస్తే ప్రత్యేక తనిఖీలు చేపట్టి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇన్‌పుట్, ఇన్సూరెన్స్, ఎంఎస్‌పీ అమ్మకాలు, పంట రుణాల సున్నావడ్డీ లాంటి ప్రభుత్వ ప్రయోజనాలు వర్తించాలంటే ఈ-క్రాప్, ఈ-కేవైసీ తప్పనిసరి అన్నారు. రైతులు కూడా ఆర్‌బీకే అసిస్టెంట్లను సంప్రదించి సకాలంలో ఈ ప్రక్రియ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

నేడు 2కే రన్

అనంతపురం అర్బన్: ఓటు హక్కు ప్రాముఖ్యతను తెలియజేసేందుకు మంగళవారం నగరంలో 2కే రన్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ గౌతమి తెలిపారు. 2కే రన్ ఉదయం 8 గంటలకు ఆర్ట్స్ కళాశాల నుంచి బయలుదేరి ఎస్ఎస్‌బీఎన్ కళాశాల వరకు సాగుతుందన్నారు. ఓటరుగా యువత నమోదు చేసుకునేలా ప్రోత్సహించడం 2కే రన్ ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తెలంగాణలో కాంగ్రెస్ గెలిస్తే మాకేంటి?



పాఠశాలను తనిఖీ చేస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

బుక్కరాయసముద్రం: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే తమకేంటని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. చంద్రబాబు ఎవరితోనైనా కలుస్తాడని, ఎవరి కాళ్లయినా పట్టుకుంటాడని విమర్శించారు. ఆయన సోమవారం బుక్కరాయసముద్రం మండలం కొర్రపాడు వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేటుకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలవడానికి, వైఎస్సార్ సీపీకి ఏం సంబంధం ఉందని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు మాత్రం ఎవరికో పుట్టిన బిడ్డలను ఎత్తుకుని ఎగురుతున్నారని విమర్శించారు. టీడీపీకి చేతనైతే తెలంగాణలో సైకిల్ గుర్తు పై పోటీ చేసి గెలవాలన్నారు. ఒకాయన ఎనిమిది చోట్ల పోటీ పెట్టి నోటా కంటే తక్కువ ఓట్లు సాధించారన్నారు. ఇంకొకాయన అసలు పోటీనే చేయకుండా జెండాలు పట్టుకుని ఎగిరి గంతు లేస్తున్నారని, ఆయన్ను కాంగ్రెస్ వాళ్లు ఎగిరి తంతారని అన్నారు. రాష్ట్ర విభజనలో పెద్ద కుట్ర జరిగిందన్నారు. చంద్రబాబు కాంగ్రెస్‌తో లాలూచీ పడినందునే రాష్ట్రాన్ని విభజించారన్నారు. పరోక్షంగా కాంగ్రెస్‌తో వెళుతున్నాడని, తెలంగాణలో సొంత పార్టీని గంగలో ముంచేసుకుని కాంగ్రెస్ గెలవాలనుకున్నాడన్నారు.




రాప్తాడులో సోమవారం నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రకు తరలివచ్చిన జన సందోహంలో ఓ భాగం

సామాజిక సౌరభం

- అన్ని వర్గాలకూ సముచిత స్థానం
- బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి
- సంక్షేమ పథకాలతో ఆర్థిక చేయూత
- బస్సు యాత్రలో ప్రతినిధులు, నేతలు
- రాప్తాడులో సామాజిక సాధికార యాత్ర విజయవంతం



జయహో జగన్: మిన్నంటిన జగన్నినాదం

కనగానపల్లి: 'వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమంతో పాటు సామాజిక, రాజకీయ పరంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు తగిన గుర్తింపు లభించింది. స్థానిక సంస్థల మొదలు చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరిగింది. నామినేటెడ్ పదవుల్లోనూ అగ్రతాంబూలమే దక్కింది. బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం జగనన్న పాలనలోనే సాధ్యమైంది' అని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నేతలు స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి నేతృత్వంలో రాప్తాడు నియోజకవర్గ కేంద్రంలో వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు మాలగుండ్ల శంకరనారాయణ అధ్యక్షతన సామాజిక సాధికార బస్సు యాత్ర నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున తో పాటు శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుమ్మనూరు జయరాం, బాపట్ల ఎంపీ నందిగం సురేశ్ హాజరయ్యారు. మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. అనంతరం మంత్రి గుమ్మనూరు జయరాంమాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు నామినేటెడ్ పదవులు కల్పించిన ఘనత వైఎస్ జగన్‌దే అన్నారు. ఎంపీ నందిగం సురేశ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99.9 శాతం అమలు చేసి రాష్ట్రంలో పేదరికాన్ని తగ్గించారన్నారు. చంద్రబాబు పాలనలో తనలాంటి బలహీన వర్గాల వ్యక్తిని జైలులో కూర్చోబెడితే.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఎంపీని చేసి పార్లమెంటులో కూర్చోబెట్టారని గుర్తు చేశారు. పక్క రాష్ట్రంలో కాంగ్రెస్ గెలిసే టీడీపీ నేతలు సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.



సభలో ప్రసంగిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున, చిత్రంలో మంత్రి గుమ్మనూరు జయరాం, ఎంపీలు గోరంట్ల మాధవ్, నందిగం సురేష్, ఎమ్మెల్యేలు తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మాలగుండ్ల శంకరనారాయణ, తిప్పేస్వామి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ, పైలా తదితరులు

రాప్తాడు జనసంద్రం

సామాజిక సాధికార బస్సు యాత్రకు రాప్తాడు నియోజకవర్గ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో జనాలు తరలివచ్చారు. మధ్యాహ్నం నుంచే రాప్తాడు కూడలి జనసంద్రంగా మారింది. బస్సు యాత్రలో ఎమ్మెల్సీ మంగమ్మ, మడకశిర, కదిరి, అనంతపురం ఎమ్మెల్యేలు డాక్టర్ తిప్పేస్వామి, డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, ఏడీసీసీ బ్యాంక్ చైర్‌పర్సన్ లిఖిత, అనంతపురం మేయర్ వసీం, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, రజక కార్పొరేషన్ చైర్మన్ మీసాల రంగన్న, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ పొగాకు రామచంద్ర, ఉర్దూ అకాడమీ చైర్మన్ నదీమ్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. బస్సు యాత్ర విజయవంతంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ కనిపించింది.

బడుగులకు జగనన్న అండ



చంద్రబాబు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటే.. వైఎస్ జగన్ వారందరికీ అన్ని రకాలుగా సామాజిక న్యాయం కల్పిస్తూ అండగా నిలిచారు. బలహీన వర్గాల ప్రజలను వెన్నెముకగా భావించిన జగన్.. వారికి రాజకీయ, సామాజిక, ఆర్థికంగా ఎదుగుదలకు తోడ్పాటునిచ్చారు. 'నవరత్నాలు' ద్వారా బడుగు, బలహీన వర్గాల ప్రజలకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో రూ.కోట్ల సొమ్ము జమ చేశారు. ఈ పథకాల ద్వారా నాలుగున్నరేళ్లలో రూ.2.45 లక్షల కోట్లను పేదలకు అందించారు. జగనన్న కాలనీల ద్వారా ఊళ్లు నిర్మించారు. రాప్తాడు నియోజకవర్గంలో 'పరిటాల' కుటుంబం 25 ఏళ్ల పాటు రాక్షస పాలన సాగిస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రజాస్వామ్యం తీసుకొచ్చాం. సీఎం జగన్ ఆశీస్సులతో నియోజకవర్గంలోని పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చి.. ఈ ప్రాంతాన్ని పంటలతో సస్యశ్యామలం చేశాం. గత టీడీపీ ప్రభుత్వంలో రెండు వేల ఇళ్లు మంజూరు చేస్తే.. గడిచిన నాలుగేళ్లలో రాప్తాడు నియోజకవర్గంలోనే సుమారు 25 వేల ఇళ్లు మంజూరు చేయించాం. రెండు వేల మంది రైతుల పొలాల్లో ఉచితంగా బోర్లు వేయించాం. మహిళా సహకార డెయిరీ ద్వారా ఆరువేల మంది మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తున్నాం.

– తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి, రాప్తాడు ఎమ్మెల్యే

జగన్‌తోనే సామాజిక విప్లవం



సీఎం జగన్ రాష్ట్రంలో సామాజిక విప్లవం తీసుకొచ్చారు. బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీలకు రాజకీయంగా పెద్దపీట వేశారు. కుల గణన జరగాలని చెప్పిన మొట్టమొదటి వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఆయా వర్గాలు ముఖ్యమంత్రికి అండగా నిలవాల్సిన సమయం వచ్చింది. గత టీడీపీ హయాంలో రాప్తాడు నియోజకవర్గంలో బాంబులు వేసి.. తుపాకులతో కాల్చి రక్తపుటేర్లు పారాయి. నేడు తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి చెరువులను నీళ్లతో నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు. రాప్తాడులో రౌడీల పాలనకు చరమగీతం పాడి ప్రజాస్వామ్యం తీసుకొచ్చారు.

– గోరంట్ల మాధవ్, హిందూపురం ఎంపీ

బడుగులకు సముచిత స్థానం



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రాజకీయ పదవులు అందించి వారికి సముచిత స్థానం కల్పించారు. అన్ని వర్గాలకూ సమన్యాయం చేసిన సీఎంగా జగన్ ఖ్యాతి గడించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కురుబ సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో చోటు ఇవ్వడంతో పాటు రెండు ఎంపీ పదవులను బీసీలకు ఇచ్చారు. జెడ్పీటీసీ, ఎంపీపీ పదవులకు జనరల్ స్థానాల్లో కూడా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశం కల్పించారు.

– మాలగుండ్ల శంకరనారాయణ, ఎమ్మెల్యే, పెనుకొండ

మహిళలకు పెద్దపీట వేసిన జగనన్న



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు అనేక రాజకీయ పదవులు కట్టబెట్టి పెద్దపీట వేశారు. వెనుకబడిన వాల్మీకి కులానికి చెందిన సామాన్య మహిళ అయిన నాకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా అవకాశం దక్కిందంటే జగనన్న చలువే. రాప్తాడు నియోజకవర్గంలో ఆరు మండలాలకు ఎంపీపీలుగా, రెండు మండలాలకు జెడ్పీటీసీ సభ్యులుగా మహిళలకు అవకాశం కల్పించారు.

– బోయ గిరిజమ్మ, జెడ్పీ చైర్ పర్సన్

అక్కున చేర్చుకుంది జగనే



నా ఎస్సీ, నా బీసీ, నా ఎస్టీ, నా మైనార్టీ అంటూ.. అన్ని వర్గాలనూ అక్కున చేర్చుకున్నది సీఎం జగన్‌మోహన్ రెడ్డి మాత్రమే. గతంలో ఏ ముఖ్యమంత్రి కూడా అణగారిన వర్గాలకు అండగా నిలవలేదు. ఎంతోమంది వెనుకబడిన కులాల వారికి రాజ్యాధికారం కల్పించి వారి గుండెల్లో జగన్ చిరస్థాయిగా నిలిచిపోయారు. ఇలాంటి వారే ముఖ్యమంత్రిగా కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారు.

– పైలా నరసింహయ్య, వైఎస్సార్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు





ఫుల్ జోష్ : సామాజిక సాధికార యాత్రలో డ్రమ్స్ వాయిద్యాల నడుమ కార్యకర్తల నృత్యం, జై జగన్ నినాదాలతో హోరెత్తిస్తున్న మహిళలు

అనంతపురం మీదుగా పలు రైళ్ల రద్దు

- కొంగు, కొండవీడు, గరీబ్‌రథ్, ఇండోర్, డెమో రద్దు
- ఫిబ్రవరి 8 తరువాత పునరుద్ధరణ



అనంతపురం సిటీ: కొత్తచెరువు వద్ద టన్నెల్ పనులు జరుగుతున్నందున అనంతపురం మీదుగా వెళ్లే వారాంతపు స్పెషల్, రోజూ తిరిగే పలు రైళ్లను రద్దు చేశారు. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా కోయంబత్తూరు-నిజాముద్దీన్ మధ్య తిరిగే కొంగు ఎక్స్‌ప్రెస్ (రైల్ నంబర్: 12647/12648) రైళ్లను రద్దు చేసినట్లు అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్‌కుమార్ సోమవారం మీడియాకు వెల్లడించారు. వీక్లీ స్పెషల్‌గా ప్రతి గురువారం బెంగళూరు, అనంతపురం, సికింద్రాబాద్, ఆగ్రా, ఢిల్లీ మీదుగా తిరిగే ఈ రైళ్లను ఫిబ్రవరి 7వ తేదీ వరకు రద్దు చేసినట్లు వివరించారు.

- యశ్వంతపుర-మచిలీపట్నం వయా అనంతపురం, నంద్యాల, విజయవాడ మీదుగా తిరిగే కొండవీడు ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్లు: 17212/17211) రైళ్లను కూడా రద్దు చేశారు. వారంలో మూడ్రోజుల పాటు (మంగళ, గురు, శనివారాల్లో) తిరిగే వీక్లీ స్పెషల్ రైళ్లను కూడా ఫిబ్రవరి 8 వరకు రద్దు చేశారు.
- యశ్వంతపుర-సికింద్రాబాద్ మధ్య తిరిగే గరీబ్ రథ్ ఎక్స్‌ప్రెస్ (రైళ్ల నంబర్: 12735/12736) రైళ్లను రద్దు చేశారు. ఈ రైళ్లు ప్రతి సోమ, గురు వారాల్లో అనంతపురం మీదుగా రాకపోకలు సాగించేవి. వీటిని ఫిబ్రవరి 8 తరువాత పునరుద్ధరిస్తారు.
- యశ్వంతపుర-ఇండోర్ వయా అనంతపురం, సికింద్రాబాద్ మీదుగా నడిచే ఇండోర్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్: 19302) రద్దయింది. ఫిబ్రవరి 6 వరకు ఈ రైలును నిలిపివేస్తున్నారు.
- గుంతకల్లు-హిందూపురం మధ్య తిరిగే డెమో ప్యాసింజర్ (రైళ్ల నంబర్లు: 07693/07694) రైళ్లను ఫిబ్రవరి 8 వరకు రద్దు చేసినట్లు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయి.

రూటు మారిన కుర్లా ఎక్స్‌ప్రెస్

కుర్లా - కోయంబత్తూరు మధ్య తిరిగే (రైళ్ల నంబర్: 11013/11014) కుర్లా ఎక్స్‌ప్రెస్ రైళ్లను రూటు మార్చి నడపనున్నట్లు అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్ కుమార్ తెలిపారు. అనంతపురం, ధర్మవరం, గుంతకల్లు మీదుగా తిరిగే ఈ రైళ్లను తిరుపతి, రేణిగుంట, నందలూరు, కడప, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు మీదుగా రూటు మార్చినట్లు వివరించారు. ఈ విషయాన్ని రైల్వే ప్రయాణికులు గుర్తించుకొని తమ ప్రయాణాలు కొనసాగించాలని కోరారు.

అర్జీలకు సంతృప్తికర పరిష్కారం చూపాలి

అనంతపురం అర్బన్: 'స్పందన', 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాల్లో ప్రజల నుంచి అందే అర్జీలకు సంతృప్తికరమైన పరిష్కారం చూపించాలని డీఆర్వో గాయత్రీదేవి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన 'స్పందన'లో డీఆర్‌ఓతో పాటు డిప్యూటీ కలెక్టర్లు సుధారాణి, ఆనంద్, డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి, నగర పాలక కమిషనర్ భాగ్యలక్ష్మి ప్రజల నుంచి 325 అర్జీలు స్వీకరించారు. అనంతరం అర్జీల పరిష్కారంపై అధికారులతో డీఆర్వో సమీక్షించారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి సమస్యను క్షుణ్ణంగా తెలుసుకుని సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు.

అర్జీల్లో కొన్ని...

- సమగ్ర శిక్షలో పనిచేస్తున్న తమకు మూడు నెలల వేతనం, మహిళా ఉద్యోగులకు మెడికల్ సెలవులు అమలు చేయాలని కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 'స్పందన'లో విన్నవించారు.
- నగర పాలక సంస్థలో తక్కువ వేతనంతో పనిచేస్తున్న పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ కార్మికులకు ఇంటి స్థలం, సంక్షేమ పథకాలు మంజూరయ్యేలా చూడాలని డీఆర్‌ఓకు మునిసిపల్ కార్మిక సంఘం నాయకులు అర్జీ అందజేశారు.

కులగణన పక్కాగా చేపట్టాలి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న కులగణన జిల్లాలో పక్కాగా చేపట్టాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. ఈ నెల 9న కులగణన సర్వే ప్రారంభమవుతుందన్నారు. కులగణన, రీసర్వే, వికసిత్ భారత్ సంకల్పయాత్ర, ఆడుదాం ఆంధ్రా, తదితర అంశాలపై కలెక్టర్ సోమవారం కలెక్టరేట్ నుంచి ఆర్డీఓలు, జిల్లా అధికారులు, ప్రత్యేక అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కులగణన సర్వేపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. చిన్నపాటి పొరపాట్లకు కూడా తావివ్వకుండా వారం రోజుల వ్యవధిలో ఇంటింటి సర్వే పారదర్శకంగా నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. కులగణన సర్వేలో సంబంధిత సంక్షేమ శాఖల అధికారులు భాగస్వాములు కావాలని చెప్పారు.

7న జిల్లాకు ఇన్‌చార్జ్ అధికారి

వికసిత్ భారత్ సంకల్పయాత్ర పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించి జిల్లాకు నియమించిన ఇన్‌చార్జ్ అధికారి ఈ నెల 7న జిల్లాకు విచ్చేయనున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల పథకాల అమలుపై ఆయా శాఖల జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. 8న క్షేత్రస్థాయిలో పర్యటిస్తారన్నారు. అధికారులు పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'పై దృష్టి పెట్టాలి

'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమం కింద రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమయ్యిందన్నారు. ఎంపిక చేసి ఐదు క్రీడాంశాల్లోని (క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో) పోటీల కోసం రిజిస్ట్రేషన్ పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఎంపీడీఓలు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. కంప్లీషన్ డ్రైవ్‌లో భాగంగా ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ నరసింహారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వీర జవాన్ల కుటుంబాల సంక్షేమానికి సహకరించండి

- కలెక్టర్ గౌతమి పిలుపు



త్రివిధ దళాల పతాక స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో సైనిక సంక్షేమ అధికారి శ్రీనివాసులు, సిబ్బంది

అనంతపురం అర్బన్: దేశ రక్షణలో భాగంగా అసువులు బాసిన జవానులు, ఉద్యోగ విరమణ చేసిన సైనికుల కుటంబాల సంక్షేమానికి విరాళాలు అందజేసి సహకరించాలంటూ ప్రజలకు కలెక్టర్ గౌతమి పిలుపునిచ్చారు. త్రివిధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో రూ.70 వేలు విలువ చేసే సాయుధ బలగాల పతాక స్టిక్కర్లను, కార్ గ్లాగ్స్‌ను ఆమె ఆవిష్కరించి, మాట్లాడారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి జె.శ్రీనివాసులు, ఎస్‌ఏ గిరిష్, జేఏ బాబాఫకృద్దీన్, ఓఎస్ అనిల్ పాల్గొన్నారు.

గుండెపోటుతో జవాన్ మృతి



నివాళులర్పిస్తున్న సీఆర్‌పీఎఫ్ అధికారులు

ఉరవకొండ: స్థానిక లక్ష్మీనరసింహ కాలనీలో నివాసముంటున్న సీఆర్‌పీఎఫ్ జవాన్ విజయ్‌కుమార్ (39) గుండెపోటుతో సోమవారం ఉదయం తన ఇంట్లోనే మృతి చెందారు. హైదరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఆయన అనారోగ్యం కారణంగా 10 రోజుల క్రితం సెలవుపై ఇంటికి చేరుకున్నారు. ఉదయం ఛాతీలో నొప్పితో బాధపడుతుంటే కుటుంబసభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లేలోపు మృతి చెందారు. విషయం తెలుసుకున్న సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు ఉరవకొండకు చేరుకుని జవాన్ మృతదేహానికి సైనిక వందనం సమర్పించారు.

‘దృశ్యం’ తరహాలో హత్య!

- మోసం చేశాడని యువకుడిని మట్టుబెట్టి, దహనం చేసిన దుండగులు
- నిందితుడి వివరణతో ఏకీభవించని పోలీసులు
- కొనసాగుతున్న లోతైన దర్యాప్తు



వన్‌టౌన్ పోలీసు స్టేషన్



మహమ్మద్ ఆలీ (ఫైల్)

అనంతపురం క్రైం: క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ నేపథ్యంలో వచ్చిన ‘దృశ్యం’ సినిమాను తలపిస్తూ ఓ హత్య జరిగింది. పోలీసుల అండర్ కవర్ ఆపరేషన్‌లో ఓ నిందితుడు పట్టుబడగా మరి కొందరి కోసం వేట కొనసాగుతున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ఈ క్రమంలో పట్టుబడిన నిందితుడు తెలిపిన అంశాలు ఒక్కసారిగా పోలీసు అధికారులనే ఆశ్చర్యానికి గురి చేశాయి. ఆ వివరణపై మరింత లోతైన దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. వివరాలు..

అనంతపురంలోని మున్నానగర్‌కు చెందిన మహమ్మద్ ఆలీ, చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన రఫీ మిత్రులు. ఇద్దరూ కలసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు. ఈ క్రమంలో రఫీకి ఇవ్వాల్సిన వాటా దాదాపు రూ.15 లక్షలను ఆలీ ఎగ్గొట్టాడు. దీంతో ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తి విడిపోయారు. గత నెల 30న మహమ్మద్ ఆలీ అదృశ్యం కావడంతో కుటుంబసభ్యులు అనంతపురం వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. దీనిపై విచారణ అనంతరం ఈ నెల 1న మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు పక్కా ఆధారాలతో ఓ అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తనను మోసం చేసిన ఆలీని ఎలాగైన మట్టుబెట్టాలని భావించిన రఫీ పక్కాప్లాన్‌తో పావులు కదిపినట్లుగా గుర్తించారు.

రూ.50 వేలకి కిరాయి

తన పథకంలో భాగంగా రఫీ ముందుగా ఆలీ స్నేహితుల్లోని ఓ యువకుడిని చేరదీశాడు. అనంతరం ఆలీ అంశం తెలిపి గుట్టుచప్పుడు కాకుండా హతమారిస్తే రూ.50 వేలు ఇస్తానని ఒప్పందం చేసుకున్నాడు. డబ్బు కోసం ఆశపడిన కిరాయి ముఠా సభ్యులు అప్పటికే తమకు సుపరిచితుడైన ఆలీని రప్పించుకుని మాటల్లో పెట్టి తమతో పాటు పిలుచుకెళ్లి ఫుల్‌గా మద్యం తాగించారు. మైకంలో ఉన్న మహమ్మద్ ఆలీ నోట్లో గుడ్డలు కుక్కి వెనుక వైపు నుంచి మెడకు చేతులు బలంగా చుట్టి ఊపిరాడకుండా చేసి హతమార్చారు. అనంతరం మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి పడేయాలని చూశారు. మొదట నంద్యాల జిల్లా గిద్దలూరు ఘాట్ ప్రాంతంలో పడేయాలని అనుకున్న వారు.. కారు నానో కావడంతో అంతదూరం వెళ్లడం శ్రేయస్కరం కాదని భావించారు. అనంతరం ఎ.నారాయణపురం శివారులోని వంకలో రాత్రి మృతదేహాన్ని పడేసి, నిప్పంటించి బూడిద చేశారు. ఈ మొత్తం ప్రక్రియలో ముగ్గురు యువకులు పాల్గొన్నారని, అందరూ చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన వారిగానే అండర్ కవర్ ఆపరేషన్‌లో పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ క్రమంలోనే ఓ నిందితుడు పట్టుబడడంతో అతని ద్వారా వివరాలు కూపీ లాగారు. నిందితుడు తెలిపిన మేరకు మహమ్మద్ ఆలీని దహనం చేసిన చోటుకు చేరుకున్న పోలీసులు అక్కడ బూడిద, ఎముకలను సేకరించి ఫొరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు.

చెల్లి కూడా పాత్రధారే?

మహమ్మద్ ఆలీని హతమార్చిన అనంతరం మృతదేహాన్ని మాయం చేయడంలో రఫీకి సొంత చెల్లెలు, అక్క, బావ మద్దతుగా నిలిచినట్లుగా తెలుస్తోంది. వీరంతా కలసి ఓ కారును ఏర్పాటు చేయగా, చెల్లెలు అన్నతో కలసి కారులో వెంట వెళ్లి మృతదేహాన్ని కాల్చి బూడిద చేసే వరకూ అక్కడే ఉన్నట్లుగా పోలీసుల ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయింది. మొత్తంగా మహమ్మద్ ఆలీని హత్య చేసి చట్టం నుంచి తప్పించుకోవాలని చూసిన వారిలో కీలక నిందితుడు తొలుత అనుమానితుడిగా పట్టుబడి నోరు విప్పినట్లుగా సమాచారం. అయితే నిందితుడి సమాచారంతో ఏకీభవించని పోలీసులు మరింత లోతైన దర్యాప్తు చేపట్టారు.

జనవాక్కు

ఇంటిల్లి పాదికి లబ్ధి



గత ప్రభుత్వ హయాంలో సరైన ఉపాధి లేక చాలా ఇబ్బందులు పడ్డాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత మా కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పడింది. దీంతో జీవనోపాధులు మెరుగు పరుచుకున్నాం. ఇంటిల్లి పాదికి సంక్షేమ పథకాల లబ్ధి చేకూరింది. మా కుమార్తెకు వరుసగా నాలుగేళ్లు అమ్మఒడి పథకం అందింది. మహిళా సంఘంలో మూడు విడతలుగా రూ.37.500 రుణమాఫీ అయింది. అలాగే సున్నా వడ్డీ కింద రూ.10వేలు లబ్ధి చేకూరింది. ఏడాదికి రూ.13.500 చొప్పున మూడేళ్లు రైతు భరోసా సొమ్ము అందుకున్నాం. సీఎం జగన్‌కు మా కుటుంబం ఎంతో రుణపడి ఉంటుంది.

– వేల్పుల భాస్కర్, సుజన, తొండపాడు, గుత్తి మండలం

ఇంత గొప్ప పాలన చూడలేదు



సీఎం వైఎస్ జగన్ పాలన ఎన్నటికీ మరువలేనిది. జగనన్న ఆరోగ్య సురక్ష కింద నయా పైసా ఖర్చు లేకుండా ఉచితంగా ఆపరేషన్ చేయించారు. ప్రతి నెలా 1వ తేదీన వలంటీర్ మా ఇంటి వద్దకే వచ్చి వితంతు పింఛన్ అందజేస్తున్నాడు. నా జీవితంలో ఇప్పటి వరకూ ఇంత గొప్ప పాలన ఎన్నడూ చూడలేదు. రాజన్న బిడ్డ మరో పదేళ్ల పాటు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నా.

– గోళ్ల శివమ్మ, కళ్యాణదుర్గం మండలం

ఇంటి వద్దకే సంక్షేమం



ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పింది. సచివాలయం ద్వారా పల్లెల్లోనే అన్ని రకాల ప్రభుత్వ సేవలను పొందుతున్నాం. చివరకు ఇంటి వద్దకే డాక్టర్లు వచ్చి వివిధ రకాల జబ్బులకు చికిత్స చేస్తున్నారు. ఇప్పటి వరకూ నేను జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో చికిత్స చేయించుకుని ఉచితంగా మందులు తీసుకున్నా. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమంలో నయా పైసా ఖర్చు లేకుండా ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను పొందాను. దీని ద్వారా నాకు బియ్యం కార్డు మంజూరైంది.

– దోణస్వామి, హుళ్లికల్లు, కళ్యాణదుర్గం మండలం

‘అమరావతి’ గైనిక్ బ్లాక్ సీజ్

అనంతపురం మెడికల్: జిల్లా కేంద్రంలోని అమరావతి ఆస్పత్రిలోని గైనిక్ బ్లాక్‌ను డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి సోమవారం సీజ్ చేశారు. వైద్యుల నిర్లక్ష్యంతోనే తల్లీబిడ్డ మృతి చెందారని అప్పట్లో కుటుంబసభ్యులు ఆందోళన చేయడంతో కలెక్టర్ గౌతమి ఆదేశాల మేరకు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి విచారణ చేపట్టారు. ఇందు కోసం త్రిసభ్య కమిటీని నియమించారు. కమిటీ సభ్యులు వివిధ కోణాల్లో విచారణ చేసిన అనంతరం అమరావతి ఆస్పత్రిలో రెగ్యులర్ గైనకాలజిస్ట్ లేరని తేల్చారు. అంతేకాక కన్సల్టెంట్ వైద్యురాలు మొదట్లో చూసి వెళ్లిపోయారని, తిరిగి ప్రవసం జరిగే సమయంలో వచ్చారని ఈ లోపు సరైన పర్యవేక్షణ లేకుండా యుటిరోటోనిక్ మందులను ఉపయోగించడం వల్ల పరిస్థితి చేజారినట్లుగా నిర్ధారణ అయింది. సిజేరియన్ చేయడం ద్వారా తల్లీబిడ్డ మరణాన్ని నిరోధించే అవకాశమున్నా ఆ దిశగా చర్యలు చేపట్టకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గర్భంలోనే ఊపిరాడక శిశువు, షాక్‌తో తల్లి మరణించినట్లుగా నిర్ధారించారు. ఈ నివేదిక ఆధారంగా పలుమార్లు షోకాజ్ నోటీసులను డీఎంహెచ్ఓ జారీ చేసినా సదరు ఆస్పత్రి యాజమాన్యం స్పందించలేదు. దీంతో సోమవారం అమరావతి ఆస్పత్రిలోని గైనిక్ విభాగాన్ని డీఎంహెచ్ఓ సీజ్ చేశారు. కార్యక్రమంలో డెమో ఉమాపతి, డిప్యూటీ డెమె త్యాగరాజు, గంగాధర్ పాల్గొన్నారు.



అమరావతి ఆస్పత్రిలోని గైనిక్ బ్లాక్‌ను సీజ్ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబదేవి

భూసంరక్షణతోనే భావితరాల మనుగడ

- నేడు ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవం



అనంతపురం అగ్రికల్చర్: మానవునికి మట్టికి అత్యంత అవినాభావ సంబంధం ఉంది. సమస్త జీవులకు ప్రకృతి ప్రసాదించిన గొప్ప సంపద ‘నేల’. భూమి లేనిదే తిండి లేదు. కట్టుకునేందుకు బట్ట... నివాసానికి ఇల్లూ ఉండదు. ఈ క్రమలో నేలను, నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. భావితరాల మనుగడకు భూసంరక్షణ చర్యలు అత్యంత అవసరమని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో నేల ప్రాధాన్యతపై అవగాహన కల్పించేందుకు ఏటా డిసెంబర్ 5న ప్రపంచ నేల ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.

భూసంరక్షణపై దృష్టి:

ఏటా జనాభా పెరుగుతోంది. ఈ క్రమంలోనే పారిశ్రామిక రంగం, నాగరికత, నగరీకరణ పెరుగుతోంది. కానీ అదే నిష్పత్తిలో నేల పెరగడం లేదు. జిల్లాలో 70 శాతం మంది ప్రజలు నేలను నమ్ముకునే జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో జనాభా అవసరాలకు అనుగుణంగా పంట ఉత్పత్తులను పెంచే క్రమంలో విచ్చలవిడిగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం వల్ల నేల ఆరోగ్యం క్షీణిస్తోంది. పర్యావరణంలో సమతుల్యత దెబ్బతిని పంటలు పండడం కష్టమైంది. పెట్టుబడులు పెరిగి రైతులు నష్టాల పాలవుతున్నారు. ప్రజారోగ్యానికీ విఘాతం కలుగుతోంది. దీంతో భూ సంరక్షణ చర్యలు అనివార్యమయ్యాయి.

భూసార పరీక్షల ద్వారా సమతుల్యత

భూసంరక్షణలో భాగంగా ప్రతి రైతూ కనీసం మూడేళ్లకోసారి మట్టి పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయశాఖ జిల్లా అధికారి ఉమామహేశ్వరమ్మ, స్థానిక భూసార పరీక్షా కేంద్రం (ఎస్‌టీఎల్) ఏడీఏ రోజాపుష్పలత తెలిపారు. ప్రకృతి వరప్రసాదమైన నేలలో సహజంగానే కొన్ని పోషకాలు ఉంటాయన్నారు. ఇటీవల నేల ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితి ఉండడంతో భూసార పరీక్షల ద్వారా నేలలో ఉండే పోషకాలు తెలుసుకుని... అవసరమైన పోషకాలు సమపాళ్లతో అందించాలని సూచిస్తున్నారు. దీని వల్ల భూసారం పెరిగి పంట దిగుబడులు పెరుగుతాయన్నారు. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వాడకాన్ని గణనీయంగా తగ్గించి వాటి స్థానంలో వర్మీకంపోస్టు, పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు, పందుల ఎరువు లాంటి సేంద్రియ పోషకాలు వినియోగించడం అత్యంత శ్రేయస్కరమని సూచించారు. భూసంరక్షణ చర్యలు చేపట్టి భావి తరాలకు బంగారు భూమిని బహుమతిగా అందించడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

రాయదుర్గం టౌన్: చెట్టు పైనుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... రాయదుర్గంలోని బీజీ తిలక్ మున్సిపల్ హైస్కూల్ సమీపంలో నివాసముంటున్న సునీల్ (38)కు భార్య, ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ట్రాక్టర్ డ్రైవింగ్‌తో పాటు కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో స్థానిక శాంతినగర్‌లో ఓ ఇంటి సమీపంలో ఉన్న చెట్టును నరికేందుకు ఒప్పందం చేసుకున్న సునీల్ ఆదివారం మధ్యాహ్నం పనిలో నిమగ్నమయ్యాడు. చెట్టు పైకి ఎక్కి కొమ్మలు నరుకుతున్న సమయంలో అదుపు తప్పి కిందపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి, పరిస్థితి విషమంగా ఉండడంతో వెనువెంటనే కర్నూలులోని జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. చికిత్సకు స్పందించక ఆదివారం రాత్రి ఆయన మృతి చెందాడు.

క్రీస్తు శాంతి సందేశం అనుసరణీయం

- అంతర్జాతీయ సువార్త ప్రసంగీకులు డాక్టర్ సతీష్‌కుమార్



కల్వరీ వేడుకల్లో ప్రసంగిస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్

అనంతపురం కల్చరల్: క్రీస్తు శాంతి సందేశం అనుసరణీయమని కల్వరీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు డాక్టర్.పి.సతీష్‌కుమార్ అన్నారు. అనంతపురంలోని జూనియర్ కళాశాల మైదానంలో కల్వరీ గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు సోమవారం రాత్రి కన్నుల పండువగా సాగాయి. ఐక్య క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ సతీష్‌కుమార్ వాక్యపరిచర్య చేశారు. ఈ సందర్భంగా కోయర్ బృందాలు ఆలపించిన భక్తిగీతాలు, చిన్నారుల ఆటపాటలు, క్రీస్తు జీవితాన్ని చాటే నాటికలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కల్వరీ మినిస్ట్రీస్ రాయలసీమ కోఆర్డినేటర్ సుమన్, ఏఐసీసీ రాష్ట్ర కార్యదర్శి క్రాంతి జాన్ వెస్లీ, కొఠారి విక్టర్ డేనియల్, జిల్లా అధ్యక్షుడు విల్సన్, ఫీబా జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యూపీ వాసి ఆత్మహత్య

గుత్తి: బతుకు తెరువు కోసం వలస వచ్చిన ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సోమవారం ఉదయం గుత్తి రైల్వే స్టేషన్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడిని యూపీకి చెందిన మిథిలేష్ కశ్యప్ (46)గా గుర్తించారు. మృతుడి వద్ద లభ్యమైన ఫోన్ నంబర్ ఆధారంగా కుటుంబసభ్యులు జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప ఫోన్ చేసి సమాచారం తెలిపారు. సెక్యూరిటీ గార్డు ఉద్యోగం చేయడానికి ఆంధ్రాకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి రెండు రోజుల క్రితం బయల్దేరాడని వారు తెలిపారు. అయితే ఆత్మహత్య ఎందుకు చేసుకోవాల్సి వచ్చింది అనే వివరాలు తెలియరాలేదు. సోమవారం ఉదయం ప్లాట్‌ఫాంపై సంచరిస్తున్న కశ్యప్... వెళుతున్న గూడ్స్ రైలు కిందకు ఉన్నఫళంగా దూకాడు. ఘటనలో అతని శరీరం రెండు ముక్కలైంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం అంగన్‌వాడీ కేంద్రం–1లో ఆదివారం రాత్రి దుండగులు చొరబడి రెండు గ్యాస్ సిలిండర్లు, 1,151 కోడిగుడ్లను అపహరించుకెళుతూ కేంద్రానికి నిప్పు పెట్టారు. మంటల్లో రిజిస్టర్లు, ప్రీస్కూల్ పిల్లల సామగ్రి, బీరువాలు, బిందెలు, బకెట్లు కాలిపోయాయి. రూ.30 వేలకు పైగా నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న సీడీపీఓ వనజ అక్కమ్మ అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రేపు కుందుర్పిలో ‘జగనన్నకు చెబుదాం’

కుందుర్పి: ‘జగనన్నకు చెబుదాం’ మండల స్థాయి కార్యక్రమం బుధవారం కుందుర్పిలో నిర్వహించనున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉదయం పది గంటలకు జరిగే కార్యక్రమానికి కలెక్టర్ గౌతమితో పాటు జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారని తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ లక్ష్మీనరసింహ తెలిపారు. మండల ప్రజలు సమస్యలు ఏవైనా ఉంటే అర్జీల రూపంలో కలెక్టర్ దృష్టికి తీసుకురావొచ్చని తెలిపారు.

జేసీపీఆర్, అస్మిత్‌పై కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: ప్రజా జీవనానికి, రవాణాకు ఆటంకం కలిగిస్తూ 30 పోలీస్ యాక్ట్ ఉల్లంఘనకు పాల్పడిన తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి, ఆయన తనయుడు జేసీ అస్మిత్‌రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ‘నా ఇల్లు... నా సొంతం’ పేరుతో టిడ్కో ఇళ్ల ముట్టడికి జేసీ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. జేసీ అస్మిత్‌రెడ్డి, అనుచరులతో భారీ ర్యాలీ నిర్వహించేందుకు ప్రభాకరరెడ్డి సిద్ధమయ్యారు. అయితే 30 పోలీస్ యాక్టుతో పాటు 144 సెక్షన్ అమలులో ఉన్నందున పోలీసులు ర్యాలీకి అనుమతించలేదు. దీంతో పోలీసుల ఆదేశాలను ఉల్లంఘిస్తూ తమ నివాసం నుంచి ర్యాలీగా బయలుదేరిన జేసీ ప్రభాకరరెడ్డి సీబీ రోడ్డు వరకూ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగించారు. అంతేకాక అధికారుల విధులను అడ్డుకున్నారు. దీంతో జేసీ ప్రభాకర్‌రెడ్డి అస్మిత్‌రెడ్డితో పాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ హమీద్‌ఖాన్ తెలిపారు.

‘పోలీసు స్పందన’కు 174 వినతులు



పిటీషనర్లతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 174 వినతులు అందాయి. ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ నేరుగా అర్జీదారులతో మాట్లాడారు. నిర్ణీత గడువులోపు సమస్యలకు పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ విజయభాస్కరరెడ్డి, ఎస్‌బీ సీఐ ఇందిర, ఎస్‌ఐ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండలో విద్యార్థుల బాహాబాహీ



కొట్టుకుంటున్న ఇంటర్, హైస్కూల్ విద్యార్థులు

ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ ఇంటర్ బాలుర కళాశాలకు చెందిన విద్యార్థులు, అదే ప్రాంగణంలోని ఎస్‌కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు సోమవారం కళాశాల ప్రధాన ద్వారం ఎదుట పరస్పరం దాడులు చేసుకున్నారు. పిడిగుద్దలతో ఒకరినొకరు కొట్టుకున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గుమిగూడారు. అధ్యాపకులు, ఉపాధ్యాయులు వారించినా వినకుండా కలబడుతుండడంతో సాధ్యం కాక పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న ఎస్‌ఐ వెంకటస్వామి, సిబ్బంది పలువురు విద్యార్థులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. కౌన్సిలింగ్ అనంతరం విద్యార్థులను వదిలేశారు. కాగా, ఘర్షణకు కారణం తెలియరాలేదు.

నేత్రపర్వంగా ఆవుల జాతర



ఆవులను ఊరేగింపుగా తీసుకెళుతున్న రైతులు



ఈడు చుట్టూ పశువులను ప్రదక్షిణ చేయిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండల కేంద్రమైన కుందుర్పితో పాటు మలయనూరు, వడ్డెపాళ్యం గ్రామాల్లో సోమవారం ఆవుల జాతర నేత్రపర్వంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతులు తమ పశువులను అలంకరించి ఊరేగింపు చేశారు. అనంతరం గ్రామ శివారున ఏర్పాటు చేసిన ఈడు (అగ్ని గుండం) చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఇలా చేయడం వల్ల ఏడాది పాటు పశువులు ఎలాంటి వ్యాధుల బారిన పడవని ఈ సందర్భంగా రైతులు తెలిపారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల సర్పంచులు మారుతేశ్వరి, గోవిందమ్మ, మాజీ సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జన చైతన్యం..ప్రభంజనం

- రాప్తాడులో సామాజిక సాధికార బస్సు యాత్రకు బ్రహ్మరథం
- భారీగా తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు
- జగన్ నినాదంతో మార్మోగిన సభా ప్రాంగణం



సభా వేదికపై వైఎస్సార్‌సీపీ జెండాలతో



సాధికార బస్సు యాత్రను తిలకిస్తున్న మహిళలు, ప్రజలు



సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న మహిళ

రాప్తాడు: రాప్తాడు జనసంద్రమైంది..నియోజకవర్గం లోని నలుదిక్కులా ఊరూవాడా ఏకమైంది.. ప్రతి పల్లె కదిలింది.. అభిమానం ఉరకలు వేయగా..అక్క చెల్లెమ్మలు, అన్నా తమ్ముళ్లు స్వచ్ఛందంగా కదలగా, యువత సైన్యంలా సాగింది.. సాధికార మంత్రమై.. చైతన్యగీతమై యాత్రకు బ్రహ్మరథం పట్టింది.. ప్రతి నోటా సంక్షేమ మాట.. జనహోరు జగనన్నకు జేజేలు పలికింది.. సోమవారం ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఆయన సోదరులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సుయాత్ర విజయవంతమైంది. నియోజకవర్గంలోని ఆత్మకూరు, అనంతపురం రూరల్, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్య కర్తలు, అభిమానులు, ప్రజలు, మహిళలు స్వచ్ఛందంగా తరలివచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఆయా వర్గాలకు చేసిన మేలును మంత్రులు మేరుగు నాగార్జున, గుమ్మనూరు జయరాం, ఎంపీ నందిగాం సురేష్, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ వివరి స్తుంటే...జనం చప్పట్లతో పెద్ద ఎత్తున స్వాగతించారు. జై జగన్...జైజై జగన్....జై టీపీఆర్...జైజై టీపీఆర్ అంటూ నినాదాలు చేశారు.



రాప్తాడులో కార్యకర్తల ఉత్సాహం

బస్సుయాత్ర సాగిందిలా..

వైఎస్సార్ సీపీ అధికారంలోకొచ్చిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం చేసిన మేలును వివరించేందుకు రాప్తాడులో నిర్వహించిన బస్సుయాత్రకు మంత్రులు , నేతలు రాగా.. వీరికి ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఆయన సోదరులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ముందుగా బస్సుయాత్ర మధ్యాహ్నం 3 గంటలకు రాప్తాడులో స్థానిక బస్టాండ్ సర్కిల్‌కు చేరుకుంది. అనంతపురం రూరల్ మండలం ఆలమూరు నుంచి రుద్రంపేట, 44వ జాతీయ రహదారి మీదుగా వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకుంది. అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అక్కడి నుంచి బస్టాండ్ సర్కిల్లో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి బస్సు యాత్ర చేరుకోవడంతో బహిరంగ సభ ప్రారంభమైంది.

ఉత్సాహంగా బైక్ ర్యాలీ..

రాప్తాడులో సామాజిక బస్సు యాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీ ఉత్సాహంగా ప్రారంభమైంది. వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, ఎన్నికల మండల ఇన్‌చార్జ్ చిట్రెడ్డి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించారు. గంగలకుంట రోడ్డు మీదకు బస్సు రావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు రోడ్డుపైకి తరలివచ్చి బస్సుపై పూలవర్షం కురిపించారు.



ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న చిన్నారి

భారీగా తరలివచ్చిన జనసందోహం..

నియోజకవర్గ కేంద్రంలో సోమవారం సాయంత్రం నిర్వహించిన సామాజిక సాధికార బహిరంగ సభ జన సందోహంతో నిండిపోయింది. బహిరంగ సభకు ఆరు మండలాల నుంచి వేలాదిగా తరలిరావడంతో రాప్తాడు జనసంద్రమైంది. సభ ప్రారంభానికి ముందు బహిరంగ సభలో సీఎం జగన్ పాలనపై వినిపించిన పాటలు అందరినీ ఉర్రూతలూగించాయి. విచిత్ర వేషధారణతో కళాకారులు సీఎం వైఎస్ జగన్ పాటలకు డ్యాన్సులు చేస్తూ అలరించారు. డప్పు కొడుతూ కళాకారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. గిరా గిరా తిరుగుతుంది ఫ్యాన్, రావాలి జగన్...కావాలి జగన్ అనే సాంగ్‌కు యువకులు డ్యాన్సులు చేసి, అందరినీ ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి రాజశేఖర్ రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకురాలు గంగుల భానుమతి, ఏడీసీసీ బ్యాంకు డైరెక్టర్ యర్రగుంట జనార్దన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ బెడదూరి గోపాల్ రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ యాదవ్, మేకలు, గొర్రెల సంఘం జిల్లా అధ్యక్షుడు పసుపుల నరసింహగౌడ్, ఎంపీపీలు చిట్రెడ్డి జయలక్ష్మి, వరలక్ష్మి, హేమలత, భాగ్యమ్మ, జెడ్పీటీసీలు హేమలత, చంద్రాకుమార్, మరూతీ ప్రసాద్, బీసీ సెల్ నాయకులు పసుపుల ఆది, చిత్రా వెంకటేష్, వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బస్సు యాత్రకు వచ్చిన ఎమ్మెల్యేలు అనంత,సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తోపుదుర్తి చందు, ధనుంజయ యాదవ్ తదితరులు



సాంస్కృతిక ప్రదర్శన



బస్సుయాత్రకు వస్తున్న రాప్తాడు వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి తదితరులు



గోడలు ఎక్కి సభ వీక్షిస్తున్న కార్యకర్తలు



యువత కేరింత



రాప్తాడులో బైక్ యాత్రలో పాల్గొన్న జెడ్పీటీసీ సభ్యురాలు పసుపుల హేమావతి తదితరులు



నందమూరినగర్‌లో బైకు ర్యాలీ దృశ్యం



సభా వేదికపై వైఎస్సార్‌సీపీ జెండాలతో...

అమ్మ డెయిరీని పరిశీలించిన మంత్రులు

రాప్తాడురూరల్: నియోజకవర్గంలోని మహిళా పాడిరైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తన సొంత నిధులు రూ. 20 కోట్లతో ఆలమూరు సమీపంలో నిర్మించిన అమ్మ డెయిరీని మంత్రులు మేరుగ నాగార్జున, గుమ్మనూరు జయరాం సోమవారం పరిశీలించారు. రాప్తాడులో జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్రలో పాల్గొనేందుకు వచ్చిన మంత్రులు ముందుగా డెయిరీని సందర్శించారు. పాడి రైతుల అభివృద్ధికి ఎమ్మెల్యే తీసుకుంటున్న చర్యలపై వారు అభినందించారు. అనంతరం పక్కనే ఉన్న జగనన్న లేఔట్‌ను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తయిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి మంచి వాతారణంలో జగనన్న లేఔట్ ఏర్పాటు చేశారన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, అహుడా చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, ఏడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ లిఖిత, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ఆలమూరులోని పాల డెయిరీని సందర్శించేందుకు వస్తున్న మంత్రులు

క్లుప్తంగా

ప్రయాణికుల భద్రతే ముఖ్యం



అనంతపురం జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ అబ్దుల్‌అజీజ్

అనంతపురం సిటీ: రైల్వే ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుంతకల్లు డివిజన్ జీఆర్పీ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని జీఆర్‌పీ పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. పాత నేరాలు, పెండింగ్ కేసులపై ఎస్‌ఐ విజయకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాదిలో జరిగిన ఘటనలు, నమోదైన కేసులపైనా ఆరా తీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతరం సిబ్బందితో మాట్లాడారు.

ప్రిన్సిపాల్ ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు

అనంతపురం అర్బన్: కొర్రపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ తమను ఇబ్బంది పెడుతున్నారని డీఆర్‌ఓ గాయత్రిదేవికి ఆ పాఠశాల విద్యార్థినులు అక్షయ, అక్షర ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో డీఆర్‌ఓను తమ తల్లితో కలిసి వినతిపత్రం అందజేశారు. తాము బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నామన్నారు. పాఠశాలలో జరుగుతున్న అక్రమాలను తమ తండ్రి చిన్న ఆంజనేయులు ప్రశ్నించారన్నారు. అప్పటి నుంచి తమను ప్రిన్సిపాల్ వేధిస్తున్నారని చెప్పారు. ఇతర విద్యార్థినులను తమతో మాట్లాడనీయడం లేదన్నారు. మీరు టీసీ తీసుకొని వెళ్లండంటూ పదేపదే చెబుతున్నారని తెలిపారు. దీంతో తాము సరిగ్గా చదువుకోలేక పోతున్నామన్నారు. డీఆర్‌ఓ స్పందిస్తూ విచారణ చేయించి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సందడిగా సపోజ్ క్రిస్మస్



సపోజ్ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: జిల్లా పాస్టర్స్ వెల్ఫేర్ సొసైటీ సర్వసభ్య సమావేశంతో పాటు సపోజ్ క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. నగరంలోని ఇక్తూస్ ప్రార్థనా మందిరంలో జరిగిన వేడుకలకు సంఘం గౌరవాధ్యక్షుడు రెవరెండ్ తిమోతీరావు వాక్య సందేశంలో క్రీస్తు జననం, మానవాళి కోసం చేసిన త్యాగంపై వివరించారు. ఫెలోషిప్ ప్రెసిడెంట్ యేషయా, ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, సెక్రటరీ పాస్టర్ వరప్రసాద్, పాస్టర్ కురియన్ డేనియల్ తదితరులు మాట్లాడారు. పాస్టర్లు రెవరెండ్ నెహమ్యా నాయక్, సచార్, ఆడమ్, కొండయ్య, డేవిడ్ రాజు, జాన్సన్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ పునఃప్రతిష్ట



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత

అనంతపురం కల్చరల్: అనంతపురం చెరువుకట్టపై ఉన్న అయ్యప్పస్వామి ఆలయం పునఃప్రతిష్ట, మండల పూజలు సోమవారం ఘనంగా ముగిశాయి. శ్రీ సాయి అయ్యప్ప సేవా సమాజం ఆధ్వర్యంలో కేరళ రాష్ట్రం శబరిమల సన్నిధానం నుంచి బ్రహ్మశ్రీ రాజీవర్ తంత్రి నేతృత్వంలో మూడురోజుల పాటు గణపతి హోమం, కలశ తింగల్ ఉష పూజ, మరపాణి అష్టబంధ లేపనతో పాటు పరికకాశీ, ఉత్సవ పూజలు కేరళ పద్ధతుల్లో సంప్రదాయసిద్ధంగా జరిగాయి. ముగింపు ఉత్సవాలకు ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు మణికంఠ గౌతం, ఆలయ కమిటీ సభ్యులు బోనా నాగలింగారెడ్డి, గజేంద్ర మోహన్, నాగానందం, రాము, కేశవ పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరా కరుణించు స్వామీ



పూజల్లో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్: కార్తీక సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామునే ఆలయాల్లో మహాశివుడికి అభిషేకాలు చేశారు. రుద్రం, చమకం పఠనం చేశారు. నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరికి కుంకుమార్చన, కేదారేశ్వర వ్రతాలు శాస్త్రోక్తంగా జరిగాయి. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు. శారదా శంకరమఠం, శివకోటి, హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ అన్నపూర్ణేశ్వరి దేవస్థానం, అరవిందనగర్‌లోని సర్వేశ్వరాలయం తదితర చోట్ల కార్తీక సోమవార పూజలు, పుష్పాలంకార సేవలు ఘనంగా జరిగాయి.

జగన్ పాలనలోనే సంక్షేమ విప్లవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం మెడికల్: రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్లగా సంక్షేమ విప్లవాన్ని తీసుకొచ్చారని ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని 33వ సచివాలయం అంబేద్కర్, 31 సచివాలయం సాయినగర్, 45 సచివాలయం విద్యుత్ నగర్ సర్కిల్, 53 సచివాలయం రాంనగర్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం జరిగింది. అంబేద్కర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి సంక్షేమ, అభివృద్ధి బోర్డులు, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. నగరపాలక సంస్థ చరిత్రలో రాణీనగర్, మున్నానగర్, అంబేద్కర్‌నగర్, బోయ వీధి ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని ఎమ్మెల్యే అనంత అన్నారు. నగరంలో మొత్తం రూ.800 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. 54 కిలోమీటర్ల మేర కొత్త రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వం ఏ పాటి సంక్షేమం, అభివృద్ధి చెందిందో గుర్తు చేసుకోవాలన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, కన్వీనర్లు, గృహసారథులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మేలును అందరికీ వివరిస్తున్నట్లు తెలిపారు. మనసున్న ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, మరోసారి ఆయన్ను ముఖ్యమంత్రి చేసుకోవడానికి అందరూ కలసికట్టుగా రావాలన్నారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు సాకే చంద్రలేఖ, బాలాంజనేయులు, కమల్‌భూషణ్, అనిల్‌కుమార్ రెడ్డి, మార్కెట్‌యార్డు చైర్మన్ ఫయాజ్, వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు రిజ్వాన్, క్లస్టర్ అధ్యక్షుడు రమణారెడ్డి, ఓబిరెడ్డి, జగదీష్, మధు, జేసీఎస్ కన్వీనర్లు చింతకుంట మధు, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించుకోవాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ శశిధర్

అనంతపురం: చిప్ రూపకల్పనలో నైపుణ్యం పెంపొందించుకోవాలని జేఎన్‌టీయూఏ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్ అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురంలోని ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో ఏఐసీటీఈ ట్రైనింగ్, లర్నింగ్ (అటల్ అకాడమీ) న్యూఢిల్లీ సహకారంతో 'ఎక్స్‌ప్లోరింగ్ ద కటింగ్- ఎడ్జ్ వరల్డ్ ఆఫ్ చిప్ డిజైన్' అనే అంశంపై ఆరు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంను సోమవారం ప్రారంభించారు. అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.మమత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. నాగభూషణ రాజు, గౌరవ అతిథిగా ఐఐఐటీ డీఎం డాక్టర్ పి.రంగబాబు , ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ చంద్రమోహన్ రెడ్డి, డాక్టర్ విష్ణువర్ధన్, పాలకమండలి సభ్యుడు డాక్టర్ ఎం. రామశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఓటు వేసే విధానంపై అవగాహన

అనంతపురం అర్బన్: ఈవీఎంలో ఓటు ఎలా వేయాలి అనే అంశంపై ప్రజలకు జిల్లా ఎన్నికల యంత్రాంగం అవగాహన కల్పించింది. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్‌ను అందుబాటులో ఉంచారు. ఈవీఎంలో ఓటు వేయడంపై ప్రజలకు అక్కడి సిబ్బంది వివరించడంతో పాటు వారి చేత ఓటు వేయించారు. ఓటు తాము వేసిన గుర్తుకే నమోదు అవుతుందా? అనే సందేహం నివృత్తి కోసం వీవీప్యాట్‌లో ఎలా ప్రింట్ (రసీదు) వస్తోందనేది ప్రయోగాత్మకంగా చూపించారు.

రిస్క్ అలవెన్స్ ఇచ్చేలా చూడండి

అనంతపురం అర్బన్: నగరపాలక సంస్థ, పురపాలక సంఘాల్లోని ఇంజినీరింగ్ విభాగం అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రిస్క్ అలవెన్స్, వేతనపెంపు అమలు చేయాలని ఆశాఖ కార్మికుల సంఘం నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో డిప్యూటీ కలెక్టర్ సుధారాణికి జిల్లా అధ్యక్షుడు సంజీవరాయుడు, నాయకులు ఓబుళపతి, సుబ్బిరెడ్డి, పోతులయ్య, లక్ష్మిదేవి, తదితరులు కలిసి వినతిపత్రం అందించారు. తమకు స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్‌స్కిల్డ్ కింద వేతనం అమలు చేయాలన్నారు. అదే క్రమంలో పారిశుధ్య కార్మికులకు హెల్త్ అలవెన్స్ ఇస్తున్న తరహాలో ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలన్నారు.

అంగవైకల్యంపై హేళన చేయరాదు

ఆత్మకూరు: అంగవైకల్యం ఉన్న వారిని చూసి హేళన చేయరాదని ఎంఈఓలు నరసింహారెడ్డి, రామాంజనేయులు తెలిపారు. సోమవారం స్థానిక భవిత కేంద్రం వద్ద ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ చేశారు. వారు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతుల పిల్లలు క్రమం తప్పకుండా ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయించాలన్నారు.

ఘంటసాల సంగీతం అజరామరం

అనంతపురం కల్చరల్: ఘంటసాల సంగీతం అజరామరమని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కరరెడ్డి, సంఘం ప్రతినిధులు ఓబుళదాసు, ఘంటసాల ఆరాధన సమితి వ్యవస్థాపకుడు పాలసముద్రం నాగరాజు, గౌరవాధ్యక్షులు ఘంటసాల రామయ్య అన్నారు. నగరంలోని హౌసింగ్ బోర్డులోని ఘంటసాల విగ్రహం వద్ద జయంతి వేడుకలు నిర్వహించారు. విజిలెన్సు ఎస్పీ మునిరామయ్య, ఎల్కేపీ అధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, కార్యదర్శి పద్మజ అమరగాయకుడు ఘంటసాల స్ఫూర్తిదాయక జీవితాన్ని గుర్తు చేసుకున్నారు.

బీసీ రమేష్‌గౌడ్‌కు మంత్రి పరామర్శ



గంగయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ రమేష్‌గౌడ్‌ను మంత్రి మేరుగు నాగార్జున సోమవారం పరామర్శించారు. ఇటీవల రమేష్‌గౌడ్ తండ్రి గంగయ్య మృతి చెందాడు. దీంతో సోమవారం రమేష్‌గౌడ్ నివాసంలో గంగయ్య చిత్రపటానికి మంత్రి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీఫ్లోర్ లీడర్ వెన్నపూస రవీంద్రారెడ్డి, నాయకులు పెన్నోబులేసు, రిలాక్స్ నాగరాజు, ఎస్కేయూ ప్రొఫెసర్ శ్రీరాములు, నాయకులు విశ్వనాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌పుట్ డీలర్లకు ధ్రువీకరణ పత్రాలు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ పరిధిలో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, ఇతరత్రా ఇన్‌పుట్స్ క్రయ విక్రయాలు సాగించే డీలర్లకు సోమవారం పరీక్ష నిర్వహించి అనంతరం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. స్థానిక కృషీభవన్‌లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ), జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) డీపీడీ మద్దిలేటి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2022-23కు సంబంధించి 52 వారాల డిప్లొమా ఇన్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ సర్వీసెస్ ఫర్ ఇన్‌పుట్ డీలర్స్ (డీఏఈఎస్‌ఐ) కోర్సు చేస్తున్న డీలర్లు హాజరయ్యారు. రాష్ట్ర స్థాయి కన్సల్టెంట్ (హైదరాబాద్) కాంచన్, అనంతపురం ఏడీఏ రవి, విశ్రాంత ఏడీఏ చంద్రమౌళి హాజరయ్యారు.

పరిశోధక విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పరిశోధక విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ విద్యార్థి సంఘం, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ చింతా సుధాకర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. పీహెచ్‌డీ థీసిస్ సమర్పించి, ఏడాది గడిచినా ఎలాంటి రిపోర్ట్స్ ఇప్పటి దాకా రాలేదన్నారు. పరిశోధన విద్యార్థులకు శాపంగా మారిన ఫారిన్ ఎవాల్యుయేషన్ విధానం తొలగించాలని కోరారు. వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు హేమంత్‌కుమార్, వాసు, నవీన్, శంకర్, మహేష్, నరేష్, కులశేఖర్, అంజి, ఎన్‌ఎస్‌యూఐ అధికార ప్రతినిధి పులిరాజు తదితరులు పాల్గొన్నారు.

8న బోధనేతర ఉద్యోగుల ఎన్నికలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం బోధనేతర సంఘం ఎన్నికలు ఈ నెల 8న నిర్వహించనున్నారు. ఈ మేరకు జనరల్ సెక్రటరీ శాంతలింగం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, జనరల్ సెక్రటరీకి సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. వైస్ ప్రెసిడెంట్‌గా బి.శివశంకర్ , జనరల్ సెక్రటరీగా పి.లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రెసిడెంట్ స్థానానికి హెచ్.ఈశ్వరయ్య, డి. ప్రతాప్‌రెడ్డి మధ్య ఈ నెల 8న ఎన్నికలు జరగనున్నాయి. మధ్యాహ్నం 1 గంట నుంచి 4:30 గంటల వరకు వర్సిటీ బోధనేతర కార్యాలయంలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కొత్తగా 'జీవన్ ఉత్సవ్' పాలసీ

అనంతపురం అగ్రికల్చర్: ప్రభుత్వ రంగ బీమా సంస్థ ఎల్‌ఐసీ తాజాగా 'జీవన్ ఉత్సవ్' అనే కొత్త పాలసీని అందుబాటులోకి తెచ్చిందని సీనియర్ బ్రాంచ్ మేనేజర్ బీడీ మధుబాబు తెలిపారు. సోమవారం స్థానిక బ్రాంచి-1 కార్యాలయంలో అసిస్టెంట్ మేనేజర్లు ఎస్.నందీశ్వర్, ఎన్ఈ ఫణికుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. జీవన్ ఉత్సవ్ పాలసీ అతి తక్కువ సమయంలో జీవితకాలం లబ్ధిపొందే అవకాశం ఉందన్నారు. ఎల్‌ఐసీ సేవలు, పాలసీల కోసం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

సీసీ రోడ్డు కాలువ పనుల పరిశీలన

అనంతపురం కార్పొరేషన్: నగరంలోని 10వ డివిజన్ హరిజనవాడలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.31 లక్షలతో జరుగుతున్న సీసీ రోడ్డు, అభివృద్ధి పనులను మేయర్ వసీం సోమవారం పరిశీలించారు. నగరంలో పేదలు నివసించే ప్రాంతాల అభివృద్ధికి తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రాధాన్యతా క్రమంలో కాలువలు ఏర్పాటు చేసి పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టాలన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైపుల్లాబేగ్, కార్పొరేటర్లు లక్ష్మిదేవి, కమల్‌భూషణ్, డీఈ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.